## క్లుప్తంగా

### వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా



బుగ్గపాడు సబ్‌స్టేషన్ వద్ద పనులను పరిశీలిస్తున్న డివిజనల్ ఇంజనీర్ రాములు, ఉద్యోగులు

**సత్తుపల్లిరూరల్:** వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ రాములు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ బి.ప్రసాద్‌బాబు తెలిపారు. 33/11 కేవీ బుగ్గపాడు సబ్‌స్టేషన్, 33/11 కేవీ సబ్‌స్టేషన్ మధ్య 2.2 కేఎం 11 కేవీ లింక్‌లైన్‌ను శుక్రవారం లోఛార్జ్ చేయడం జరిగింది. ఈ లింక్ లైన్ వల్ల రిజర్వ్ ఫారెస్ట్ ఏరియా గుండా వెళ్తున్న 11కేవీ రేగళ్లపాడు లైన్, బుగ్గపాడు గ్రామం నుంచి వెళ్తున్న 11కేవీ బుగ్గపాడు లైన్‌లకు ప్రత్యామ్నాయ లైన్‌గా ఈ లింక్ లైన్ ఉపయోగకరమన్నారు. అదే విధంగా ఈ లింగ్‌లైన్ వల్ల చంద్రాయపాలెం, రేగళ్లపాడు, యాతాలకుంట గ్రామాలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

### మద్దతు ధర చెల్లించాలి

**చింతకాని:** మిర్చి పంటకు క్వింటాకు రూ.25 వేల మద్దతు ధర చెల్లించాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు ఆత్మహత్యలను నివారణకు రైతులు పండించే పంటలకు మద్దతు ధర కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో మధిర డివిజన్ రైతు సంఘం నాయకుడు నర్సయ్య, సీపీఎం మండల కార్యదర్శి రాము, నాయకులు జానికిరాములు, వెంకటనర్సయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

### అందమైన చేతిరాతతోనే మన్ననలు



రమేష్‌ను సత్కరిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

**సత్తుపల్లిటౌన్:** చేతిరాత మెరుగుపరుచుకోవడం ద్వారా పరీక్షల్లో మంచి మార్కులు సాధించి అందరి మన్ననలు పొందవచ్చని ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని విశ్వశాంతి స్కూల్‌లో 12 రోజులుపాటు చేతిరాత శిక్షణ ఇచ్చిన చేతిరాత నిపుణుడు వి.రమేష్‌ను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో యాజమాన్యం పి.నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 23న గురుకులాల్లో ప్రవేశ పరీక్ష

**కల్లూరు:** 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి కల్లూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలోకి ప్రవేశం 6,7,8,9 తరగతుల్లో సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ కనకదుర్గ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లతో పాటు ఆధార్‌కార్డు కూడా తీసుకురావాలన్నారు. ఉదయం 10 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి హాజరు కావాలన్నారు.

**పరీక్షకు సకాలంలో హాజరుకావాలి..**

**కొణిజర్ల:** మండలంలోని అమ్మపాలెం పరిధిలో గల తెలంగాణ ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం నిర్వహించే సీఓఈ( మైనార్టీ కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ) ప్రవేశ పరీక్షకు సకాలంలో హాజరుకావాలని ప్రిన్సిపల్ లింగాల జితేష్ సాహిల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 99491 28003 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### 23న ఆలయ వార్షికోత్సవం

**మధిర:** మడుపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి, భావనాఋషి, భద్రావతి, అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు యలమద్ది రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న ఉదయం 9.25 గంటలకు భద్రావతి, భావనాఋషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని, మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### ప్రారంభమైన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం

**తల్లాడ:** మండలంలోని పినపాక గ్రామంలో నూతనంగా నిర్మించిన సోమలింగేశ్వర స్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ఆచార్యులు గోవింద శర్మ, మురళీధర శర్మ, కిషోరా చార్యులు, అంకుశశర్మ, నిఖిల్ ఆధ్వర్యంలో ఉదయం గోపూజ, గురు వందనం, ద్వజారోహణం, మహాగణపతి పూజ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దేవతా మూర్తుల ఊరేగింపు నిర్వహించారు.

# పగలు ఎండ.. రాత్రి చలి

- భిన్నమైన వాతావరణం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఎండలో కాలేజీకి వెళ్తున్న విద్యార్థులు

**కొణిజర్ల:** వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మొన్నటి వరకు జలికి గజగజ వనికిన ప్రజలకు ఉక్కపోత షురూ అయ్యింది. ఇలా అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు ఎండాకాలాన్ని తలపిస్తూ సాధారణం కంటే ఎక్కువగా ఉంటుండగా, ఉదయం, రాత్రి వేళల్లో చలి తీవ్రత అధికంగా ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి వేడి పెరుగుతూ సాయంత్రం 6 గంటల వరకు ఉండటంతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

- రాత్రి సమయంలో, తెల్లవారుజామున మంచులో ఎక్కువగా తిరగొద్దు.. తప్పని సరి పరిస్థితుల్లో పూర్తి రక్షణలో బయటకు రావాలి.
- గొంతునొప్పి, జలుబు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వైరల్ ఇన్‌ఫెక్షన్‌గా గుర్తించి తక్షణమే చికిత్స చేయించుకోవాలి.
- రోడ్ల వెంట అమ్మే చల్లని పానియాలు, కలుషిత ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి.
- శరీరంలో నీటి సమతుల్యత కోసం రోజుకు కనీసం 4 లీటర్ల నీరు తాగాలి. మజ్జిగ, పండ్ల రసాలు వంటివి తీసుకోవాలి. కొబ్బరి నీళ్లు శ్రేయస్కరం
- ఎండలో వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రయాణాలు చేయాలి.



చలిమంట కాగుతున్న మహిళలు

**వాతావరణ మార్పులతో ఆందోళన..**

వాతావరణ మార్పులతో జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. చిన్నా పెద్ద లేకుండా ప్రజలు జ్వరాల భారీన పడుతున్నారు. జలుబు, గొంతు నొప్పి, జ్వరం వంటి లక్షణాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడద కూడా అధికంగా ఉంటుంది. రాత్రుల్లో చల్లగా, పగటి పూట వేడిగా ఉండడం ఇలా భిన్నమైన వాతావరణం ఉండడం కూడా అనారోగ్యాలకు కారణమవుతుంది.

**వడదెబ్బకు గురవుతున్న కూలీలు..**

ప్రస్తుతం వరి కోతలు, మిర్చి కోతలు, మొక్కజొన్న పనులు ముమ్మరంగా సాగుతున్నందున కూలీలు ఉదయాన్నే మంచులో పనులకు పోతున్నారు. 9 గంటల కల్లా వాతావరణంలో మార్పులు వచ్చి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో కూలీలు తీవ్రమైన వడదెబ్బకు గురి అవుతున్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

# సేవాలాల్ మార్గం అనుసరణీయం



అమ్మపాలెంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు

**కొణిజర్ల:** గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ గిరిజనుల అభివృద్ధికి తన జీవితాన్ని అర్పించిన సంత్ సేవాలాల్ మహరాజ్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. మండలంలోని అమ్మపాలెంలో సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ భోగ్ భండారో కార్యక్రమంలో పాల్గొని భోగ్ కుండ్‌లో నెయ్యి వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి గిరిజనులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమానికి ఇందిరమ్మ రాజ్యమైన కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వం తరుపున నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా అమ్మపాలెం మేరమ్మ గుడి ప్రహరీ నిర్మాణానికి, రాజ్యాతండాలో మధ్యలో నిలిచిన కల్యాణ మండపం పనులు పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని స్థానికులు కోరగా.. తప్పకుండా సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు సూరంపల్లి రామారావు, వడ్డె నారాయణరావు, భూక్యా వీరభద్రం, తాతా సుధాకర్, జయవిలాసినీ వెంచర్స్ ఎండీ డాక్టర్ కుంచపు రాంబాబు, గిరిజన నాయకులు రాంలాల్‌నాయక్, సురేష్, నాగేశ్వరరావు, కోసూరి శ్రీనివాసరావు, షేక్ గాలీబ్‌పాషా, షేక్ మస్తాన్, చెరుకుమల్లి రవి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అనూష, మూడ్ సిద్దు నాయక్, యూత్ కాంగ్రెస్ అనీల్, ముత్తారావు, గిరిజన పెద్దలు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ఆక్రమణకు గురికావొద్దు..

**వైరా/వైరారూరల్:** ప్రభుత్వ స్థలాలు అక్రమణలకు గురి కాకుండా చూడాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వైరాలోని ఇటీవల ప్రారంభమైన వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను, ఐఎంఎల్ డిపో సమీపంలో ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించారు. అదే విధంగా వైరారూరల్ మండలంలోని స్నానాల లక్ష్మీపురం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణలో నిర్మిస్తున్న కల్యాణమండపం, అభిషేక మండలం ఇతర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పరిశీలించారు. ఈ నెల 26న ప్రారంభమయ్యే శివరాత్రి జాతర సమయానికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ఎమ్మెల్యే వెంట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, వెంకటనర్సిరెడ్డి, సీతారాములు, కృష్ణారావు, అశోక్, దిలి హరినాథ్, శంకర్ నాయక్ తదితరులున్నారు.

# ఉన్నత లక్ష్యాలు సాధించాలి

**సత్తుపల్లి:** పది విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. పట్టణంలోని కేపీఆర్ గౌతమ్‌మోడల్ స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సత్తుపల్లి విద్యాభారతి కళాశాల ఆధ్వర్యంలో సత్తుపల్లి, వేంసూరు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 2వేల మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదివి పుట్టిన ఊరుకు, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులే దేశాభివృద్ధికి బాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, విద్యాభారతి కళాశాల చైర్మన్ లింగారెడ్డి, కేపీఆర్ స్కూల్ కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సుజలరాణి, పట్టణ మాజీ కౌన్సిలర్లు పద్మజ్యోతి, నాగలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్

# హామీలను ఎప్పుడు అమలుచేస్తారు?



వైరా: మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి, పక్కన నాయకులు

**వైరా/కల్లూరు/తల్లాడ:** ఎన్నికల సమయాన ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలుచేస్తారో కాంగ్రెస్ నేతలు చెప్పాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయం చెప్పకుండా ప్రజల ముందుకు వచ్చే అర్హత లేదని తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ బలపర్చిన పులి సరోత్తమరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన వైరాలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ బాటలోనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నడుస్తోందని, మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఈమేరకు ఉపాధ్యాయులు ఆలోచించి సరోత్తమరెడ్డిని గెలిపించాలని కోరారు. కాగా, కల్లూరు, తల్లాడలో కూడా ఉపాధ్యాయులను కలిసి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా విస్తృత ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. నాయకులు రమేష్, ఉదయ్‌ప్రతాప్, నాగేశ్వరరావు, రవికుమార్, రామలింగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, సుధాకర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీగా మరోసారి గెలిపించాలి

**అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని..**

**ఎర్రుపాలెం:** వరంగల్ – ఖమ్మం – నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ముత్తయ్య, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు కోరారు. శుక్రవారం మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, గురుకుల పాఠశాల, కళాశాలలను సందర్శించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నర్సిరెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్, యూటీఎఫ్ నాయకులు భూషణ్ రాజు, నంద్రు వెంకటేశ్వరరావు, నీలం అజయ్ కుమార్, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, రవికుమార్, సత్యనారాయణ, కుటుంబరావు తదితరులున్నారు.

**గోపాల్‌రెడ్డి గెలుపునకై ప్రచారం..**

**కారేపల్లి:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్పొరేట్ రాజకీయం నడుస్తుందని, పదవుల కొనుగోలు యత్నాన్ని తిప్పికొట్టాలని.. తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు విమర్శించారు. శుక్రవారం కారేపల్లిలోని వివిధ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పన్నాల గోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఉద్యమాల పంతులు గోపాల్‌రెడ్డికి టీజేఎస్ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు సర్దార్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌నాయక్, ఖమ్మం నగర అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీపాల్ రెడ్డిని గెలుపును కాంక్షిస్తూ..**

**వేంసూరు:** టీఎస్ పీఆర్‌టీయూ అభ్యర్థి పింగళి శ్రీపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర బాధ్యులు చిత్తులూరి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### ఆలయ నిర్మాణానికి రూ.58వేల విరాళం

**సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లి ద్వారకాపురిలో నిర్మిస్తున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు శుక్రవారం విరాళం సమర్పించారు. ఈమేరకు యల్లంకి పార్థసారధి,తారావాణి దంపతులు శుక్రవారం రూ.58,116విరాళం అందజేయగా ఆలయ నిర్మాణ బాధ్యులు ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

### టేబుల్ ఫ్యాన్ వితరణ



పాఠశాలకు ఫ్యాన్ అందిస్తున్న దాతలు

**కారేపల్లి:** మండలంలోని బాజుమల్లాయిగూడెం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారి కోరం లోహిత శ్రీ పుట్టిన రోజు సందర్భంగా.. చిన్నారి తల్లిదండ్రులు పాఠశాలకు టేబుల్ ఫ్యాన్ వితరణగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టి చిన్నారి లోహితశ్రీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోటమ్మ, ప్రధానోపాధ్యాయులు రాంబాబు, ఉపాధ్యాయులు సాంబశివరావు, సుజాతరావు, వెంకటరామయ్య, గ్రామస్తులు కోరం చరిత్, వెంకటవర్మ పాల్గొన్నారు.

### 'ముంచుకొస్తున్న ఆర్థిక మాంద్యం'

**కొణిజర్ల:** ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ముంచుకొస్తుందని, పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు వృద్ధిని సాధించలేక ఇబ్బందులు పడుతున్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బండరు రమేష్, తాళ్లపల్లి కృష్ణ తెలిపారు. శుక్రవారం కొణిజర్లలోని సంక్రాంతి రామచంద్రయ్య భవన్‌లో రెడ్‌బుక్ డే సందర్భంగా నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం పెరుగుదలకు పెట్టుబడిదారీ వ్యవస్థనే సమాధానం చెప్పాలన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడేందుకు కమ్యూనిస్టులు ఏకం కావాలన్నారు. చెరుకుమల్లి కుటుంబరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

### పన్నులు చెల్లించాలి

**వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల ప్రజలు, దుకాణదారులు పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ చింతా వేణు సూచించారు. శుక్రవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని దుకాణాల నిర్వాహకులతో మాట్లాడి పన్నులు వసూలు చేశారు.

### ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

**వైరారూరల్:** మండలంలోని గరికపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న డోలు నిహారిక, బాణాల హేమా జిల్లా స్థాయిలో 2024–25 ఏడాదికి గానూ నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష ఫలితాల్లో 5వ స్థానం సాధించి ప్రతిభ కనబర్చారు. హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

### తహసీల్దార్‌కు వినతి

**వైరా:** పెండింగ్‌లో ఉన్న ధాన్యం బోనస్ డబ్బులు విడుదల చేయాలని కోరుతూ.. రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ కేవీ శ్రీనివాస్‌కు వినతి అందించారు. ఈ సదర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. జిల్లాలో 23,244 మంది రైతులకు రూ.64,41,83,400 బోనస్, ఒక్క వైరా మండలంలోనే సుమారు 3,115 మంది రైతులకు రూ.9 కోట్ల 45లక్షల రూపాయల బోనస్ డబ్బులు బకాయిలు ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చలపతిరావు, శ్రీనివాసరావు, నరసయ్య, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, వీరభద్రం, మధు, చలపతి రావు, శివ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి మ్యాథ్స్ ఒలంపియాడ్‌కు ఎంపిక

**ముదిగొండ:** అమ్మపేట రవీంద్రభారతి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కనపర్తి దీక్షిత జిల్లాస్థాయి మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయిలో నిర్వహించే పరీక్షకు ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్‌ఎం అనసూరి నరేష్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

### ఘర్షణ విషయంలో కేసు నమోదు

**బోనకల్:** మండలంలోని రావినూతలలో పొలానికి సాగర్ నీళ్లు పెట్టుకునే అంశంపై ఇరువురు ఘర్షణ పడగా గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన తాళ్లూరు రాంబాబు, గార్లపాటి కిషోర్ తమ పొలాలకు నీళ్లు పెట్టుకునే విషయంలో ఘర్షణ పడుతూ పరస్పరం దాడి చేసుకున్నారు. ఈమేరకు వేర్వేరుగా అందిన ఫిర్యాదులతో కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.

**మామను కొట్టిన వ్యక్తిపై...**

**చింతకాని:** కొణిజర్లకు చెందిన రాయల సాయికిషోర్‌పై చింతకాని పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలంలోని లచ్చగూడెంకు చెందిన నాగమణితో సాయికిషోర్ వివాహం జరగగా, భార్యాభర్తల మధ్య ఘర్షణతో ఆమె తల్లిగారింట్లో ఉంటోంది. ఈమేరకు శుక్రవారం లచ్చగూడెం వచ్చిన ఆయన గొడవ పడుతుండగా అడ్డు వెళ్లిన మామ అప్పారావును కొట్టాడు. దీంతో సాయికిషోర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

### రాయపట్నం వాసికి తీవ్రగాయాలు

**మధిర:** మండలంలోని రాయపట్నంకు చెందిన తేళ్ల సాయికుమార్ హైదరాబాద్‌లో జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన గురువారం బండ్లగూడ మీదుగా స్కూటీపై వెళ్తుండగా లారీ ఢీకొనడంతో కుడి చేయి తెగిపోయింది. అంతేకాక మిగతా భాగాల్లో తీవ్రగాయాలు కావడంతో అక్కడి ఆస్పత్రిలో చేర్పించారు. కాగా, సాయికుమార్ చికిత్సకు రూ.8లక్షలకు పైగా అవసరముండడంతో దాతలు చేయూతనివ్వాలని కోరుతున్నారు.

# రైతులు అధైర్యపడొద్దు..



బోనకల్: మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు

**బోనకల్:** గ్రామాల్లో పంటపొలాలు ఎండిపోకుండా సాగర్ జలాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లు, తహసీల్దార్ పున్నం చందర్, మండల వ్యవసాయాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తహసీల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ.. రైతులు అధైర్య పడొద్దని, బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని చివరి ఆయకట్టు భూములైన ఆళ్లపాడు, గోవిందాపురం(ఏ), మోటమర్రి, రావల్లి, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో పంట పొలాలు ఎండిపోకుండా సాగర్ జలాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, ఏఈఓలు నాగసాయి, రజిత, ఉస్సేన్‌సాహెబ్, అనూష, త్రివేణి పాల్గొన్నారు.

- **చింతకాని:** చివరి ఆయకట్టు భూములకు సాగర్ జలాలు అందించాలని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు అన్నారు. శుక్రవారం తహసీల్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ, పోలీస్ శాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల భూములు ఎండిపోకుండా చూసుకునేందుకు గ్రామ, మండల కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. రైతులు సాగర్‌జలాలు వృథా కాకుండా పంట పొలాలకు వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ డీఈ రాంప్రసాద్, ఏఈ సందీప్, మండల వ్యవసాయాధికారి మానస, విద్యుత్ సబ్ ఇంజనీర్ సందీప్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రఘు, జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



వరి పొలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజ్, నాయకులు

**చింతకాని:** పండించిన పంటకు మద్దతు ధర లేక అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న కౌలురైతు ఎల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని లచ్చగూడెంలో బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరామర్శించి మాట్లాడారు. సాగునీరందక కళ్లముందే పంట ఎండుతుంటే మనస్థాపంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇప్పటికే మండలంలో ముగ్గురు రైతులు బలవర్మరణం చెందారన్నారు. ఎల్లయ్య కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియోతో పాటు ఇందిరమ్మ ఇల్లు, పిల్లల చదువుకు సహకారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎల్లయ్య సాగుచేస్తున్న వరి పొలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య, నాయకులు హనుమంతురావు, రమేష్, నర్సయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### అవగాహనతోనే క్షయ అంతం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి నవ్యకాంతి

**కల్లూరురూరల్:** మనిషిని బలహీన పరిచి మరణానికి దగ్గర చేసే క్షయ వ్యాధిపై పూర్తి అవగాహన అవసరమని వైద్యాధికారి నవ్యకాంతి సూచించారు. శుక్రవారం కిష్టయ్య బంజరులో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ.. టీబీ వ్యాధిగ్రస్తులుకు ఉచితంగా మందులు అందిచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీబీ చికిత్స సూపర్‌వైజర్ సురేష్, ల్యాబ్ సూపర్‌వైజర్ సంజీవ్‌కుమార్, హెల్త్ ఎక్స్‌న్షన్ ఆఫీసర్ టీవీ సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ గుండపనేని రామారావు, ఏఎన్‌ఎంలు విజయలక్ష్మి, నిర్మల, ఆశా కార్యకర్తలు రాణి, లక్ష్మి పాల్గొన్నారు.


### పంట పొలాలకు దారి చూపండి

**వేంసూరు:** గ్రీన్ పీల్డ్ హైవేకు ఇరు వైపుల ఉన్న పంట పొలాలకు దారి చూపాలని కోరుతూ.. వేంసూరు, ఎర్రగుంటపాడు రెవెన్యూ రైతులు శుక్రవారం గ్రీన్ పీల్డ్ హైవే వద్ద ధర్నా చేశారు. హైవే నిర్మాణంతో తమ పొలాల్లోకి వెళ్ళేందుకు దారి లేకుండ పోయిందని, దీంతో పొలంలోకి వెళ్లాలంటే కిలో మీటర్ల కొద్ది తిరిగి పక్క రైతుల పొలాల్లోంచి రావాల్సి వస్తుందని, మామిడి తోటల్లోకి ట్రాక్టర్లు సైతం వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. అధికారులు స్పందించి గ్రీన్ పీల్డ్ హైవే పక్కన పంట పొలాల్లోకి వెళ్లేందుకు దారి చూపాలని రైతులు డిమాండ్ చేశారు.

### పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి

**బోనకల్:** సాయుధ పోరాట యోధురాలు సీతమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్ అన్నారు. శుక్రవారం గోవిందాపురం(ఎల్)గ్రామంలో నిర్వహించిన సీతమ్మ సంస్మరణ సభలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు వీరభద్రం, చంద్రయ్య, వెంకయ్య, వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు, సురేష్, బాబు పాల్గొన్నారు.

# ఘనంగా మాతృభాషా దినోత్సవం



కొణిజర్ల: పోస్టర్ ప్రదర్శన చేస్తున్న బాలికలు

**కొణిజర్ల:** మండలంలోని తనికెళ్లలో గల గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు పోస్టర్ ప్రదర్శన ద్వారా మాతృభాష గొప్పతనం గురించి వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఏ రజిత మాట్లాడుతూ ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన ఊరుని, కన్న తల్లిని మాతృభాషను మరువ వద్దన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ యం నవ్య, కోఆర్డినేటర్ కేపీ ఐశ్వర్య, తెలుగు విభాగాధిపతులు సమత, త్రివేణి అధ్యాపక బృందం పాల్గొన్నారు.

- **చింతకాని:** మండలంలోని నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించగా.. పాఠశాల కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్ మాట్లాడారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభాపరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు రేణుక, శ్రీనివాసరావు, గోపిచంద్, వినీల, పార్వతి, సుజిత, త్రివేణి పాల్గొన్నారు.